క్లుప్తంగా

వేలంలో రూ.40 వేల ఆదాయం

పుంగనూరు: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం కేసులో పట్టుబడిన వాహనాలను చిత్తూరు ఏఈఎస్ ఆయిషా ఆధ్వర్యంలో వేలం వేయగా రూ.40,710 ఆదాయం వచ్చినట్లు సీఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మూడు వాహనాలను వేలం వేశారు. వాహనాల వేలంలో వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేశామన్నారు.

వీధి లైట్ల ఏర్పాటు

పెద్దపంజాణి: నేలపల్లి సమీపంలోని సోలార్ ప్లాంటు వారి ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో సోలార్ వీధి లైట్లను ఏర్పాటు చేశారు. ప్లాంటు మేనేజర్ భరత్‌కుమార్, సర్పంచ్ రవికుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ


శిక్షణ ఇస్తున్న అధికారులు

సోమల: మండలంలోని నెల్లిమంద రైతు భరోసా కేంద్రం పరిధిలోని కంచంవారిపల్లెలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా సోమవారం రైతులకు శిక్షణ నిర్వహించినట్లు ఏఓ సుధాకర తెలిపారు. రబీ సీజన్‌లో తక్కువ ఖర్చుతో వరి పంటలో అధిక దిగుబడులు సాధించడంపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ సయ్యద్‌బాషా, ఏఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

మండల మీట్ రేపు

గుడుపల్లె: మండల సర్వసభ్య సమావేశం 5వ తేదీన బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంకర్ తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

6న సత్యనారాయణ వ్రతం

సదుం: ఎర్రాతివారిపల్లె సమీపంలోని కన్యమూల వినాయకస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈనెల 6న రమా సమేత వీర వెంకట సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వ్రతంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్

బైరెడ్డిపల్లె: లింగ నిర్ధారణ చేసుకోవడం చట్టరీత్యా నేరమని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ సూచించారు. బైరెడ్డిపల్లె సచివాలయం వద్ద సోమవారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌డీ సీట్లపై పునఃసమీక్షించాలి

చిత్తూరు కలెక్టరేట్: పీహెచ్‌డీ సీట్ల కేటాయింపులపై ఉన్నత విద్యామండలి పునఃసమీక్షించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి కోరారు. ఈమేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆర్ సెట్, నెట్ పరీక్షల్లో క్వాలిఫై అయిన పీహెచ్‌డీ విద్యార్థులకు విశ్వవిద్యాలయాల్లో సీట్ల కేటాయింపులపై రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం మూడేళ్లపైబడి పదవీకాలం ఉన్న ప్రొఫెసర్స్‌ని పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్స్‌గా నియమించాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లు పీహెచ్‌డీ స్కాలర్లకు మూడేళ్ల కాల పరిమితి ఉన్న ప్రొఫెసర్స్‌ని మాత్రమే గైడ్స్ గా నియమించాలని డిమాండ్ చేశారు.

విశ్రాంతి భవనానికి స్థలం కేటాయించండి


జేసీకి సమస్యలను వివరిస్తున్న పన్నీర్ సెల్వం

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ డ్రైవర్లు విశ్రాంతి పొందేందుకు కలెక్టరేట్‌లో విశ్రాంతి భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పన్నీర్ సెల్వం కోరారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం నాయకులు జేసీ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి పలు సమస్యలను చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. విధి నిర్వహణలో ఉండే ప్రభుత్వ ఉన్నతాధికారులు, జిల్లా అధికారుల డ్రైవర్లు విశ్రాంతి పొందేందుకు భవనం అవసరమన్నారు. కలెక్టరేట్‌లో భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జేసీ న్యాయం చేస్తామన్నారు.

నమాజ్‌తో ఆరోగ్యమస్తు!

- సత్ప్రవర్తన అలవడుతుంది
- క్రమశిక్షణ నేర్పుతుంది
- నమాజ్‌లో ప్రధాన క్రియల్లో దాగున్న ఎన్నో మర్మాలు


నమాజు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

పలమనేరు: ప్రతి మతం వారు విశ్వసించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దైవచింతనలో వ్యాయామం మేలవించి ఆరోగ్యానికి మేలు చేసేవే. హిందువులు ఆలయాలకు వెళ్లి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసినా, లెంపలేసుకున్నా, గుంజీలు తీసినా, చేతులు జోడించి నమస్కరించుకున్నా ప్రతి అంశంలోనూ శారీరక వ్యాయామం ఉంది. ఇదేవిధంగా క్రైస్తవులు నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో, ముస్లింల నమాజ్‌లోనూ మనిషి ఆరోగ్యానికి దోహదపడే అంశాలెన్నో ఉన్నాయి.

రంజాన్ మాసంలో నమాజ్‌కు ఎంతో ప్రాముఖ్యత..

ప్రస్తుతం రంజాన్ మాసం సందర్భంగా జిల్లాలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాసాలు ప్రారంభమయ్యాయి. అల్లా దీవెనల కోసం వీరు ప్రార్థిస్తున్నారు. కేవలం అల్లాను ప్రార్థించడమే కాదు నమాజు ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణ తప్పక అలవడతాయని ముస్లింల నమ్మకం. నమాజు వెనుక దాగిన అసలు పరమార్థం ఇదేనని వీరి విశ్వాసం. ముస్లింలు రోజుకు ఐదుమార్లు నమాజు చేస్తారు. ఇందులో తక్బీర్, ఖియాం, రుకూ, జల్సా, సజ్దా, సలాం అనే క్రియలుంటాయి. వాటి వల్లా ఎన్నో ఉపయోగాలున్నాయి.

తక్బీర్..

నమాజు మొదలు పెట్టేముందు రెండు చేతులను చెవుల వరకు తీసుకెళ్లి మళ్లీ కిందకు దించి నాభిపైన పెట్టుకుంటారు. ఈ క్రియ ద్వారా చేతికి బలం చేకూరుతుంది. గుండెకు విశ్రాంతి లభిస్తుంది. రెండు చేతులను పైకెత్తి కిందకు దించడం ద్వారా ఆధ్యాత్మిక చింతనతోబాటు శరీరంలో రక్తప్రసరణ క్రమపద్ధతిలో జరుగుతుంది.

ఖియాం..

నమాజు చదవడానికి నిటారుగా నిలబడడాన్ని ఖియాం అంటారు. అల్లాహ్ అక్బర్ అని తక్బీర్ ఉచ్చరిస్తూనే కుడిచేతి బొటన, చిటికెన వేళ్ల ఎడమచేతి మణికట్టును నాభిపై ఉంచుకుంటారు. దీంతో మనస్సుకు ప్రశాంతత చేకూరుతుంది. దైవంపై మనస్సును లగ్నం చేస్తే మరింత ప్రశాంతత దొరుకుతుంది. దీంతో రోగాలు దరి చేరవు. ముఖ్యంగా కీళ్లనొప్పులు నయం అవుతాయి.


తక్బీర్


సజ్దా


రుకూ


సలాం

సజ్దా..

ఈ ప్రక్రియలో పాదాలు, మోకాళ్లు, అరచేతులు, ముక్కు, నుదురు నేలను తాకుతాయి. అల్లాహ్ ఎదుట షాష్టాంగప్రమాణం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. దీంతో శరీరంలోని అన్ని అవయవాలకు రక్తప్రసరణ సమపాళ్లలో జరుగుతుంది. మెదడు చురుకుదనంగా మారుతుంది. ముఖ్యంగా అల్సర్‌తో బాధపడేవారికి చాలా మంచిది. ఇక తొడ భాగంలోని కొవ్వు కరిగిపోతుంది.

రుకూ..

దీని ద్వారా శరీరంలోని కొలస్ట్రాల్ మాయమవుతుంది. రెండు చేతులను మోకాళ్లపై ఉంచుకుని నడుమును సమాంతరంగా వంచుతూ చూపును రెండుకాళ్ల బొటన వేళ్ల మధ్యన కేంద్రీకరించాలి. దీంతో ఉదర భాగానికి మంచి వ్యాయామం కలుగుతుంది. గుండె, మెదడు సమాంతరంగా ఉండడంతో జీర్ణాశయం పనితీరు మెరుగుపడుతుంది. బొటన వేళ్ల మధ్య నరాలు ఉత్తేజమవుతాయి. దీంతో వెన్నముక నొప్పులు మటుమాయం అవుతాయి.

సలాం..

సలాం వలన మెదడుకు మంచి వ్యాయామం లభిస్తుంది. నమాజులో ఇది చివరి ఘట్టం. తలను ఒకదఫా కుడివైపునకు తిప్పి మరోమారు ఎడమవైపునకు తిప్పడం ద్వారా సలాంను ఆచరిస్తారు. నమాజ్‌ను ఆచరించే సమయంలో రెండు భుజాల పైన దైవదూతలు వేచిఉండి భక్తుల చేస్తున్న మంచి చెడులను గమనిస్తుంటారని వీరి విశ్వాసం. ఇది మెదడుకు బలాన్ని ఇవ్వడంతో పాటు నేత్రశక్తిని పెంపొందిస్తుంది.

గుత్తార్లపల్లి విద్యార్థుల ప్రతిభ

కుప్పం: గుడుపల్లె మండల గుత్తార్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగిన ఎక్స్‌పో ప్రదర్శనలో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం రూపేష్‌కుమార్ తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన ప్రదర్శనలో టమాట ఉత్పత్తులపై చేసిన ప్రాజెక్ట్‌కు మొదటి బహుమతి వచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం రాష్ట్రస్థాయిలో విజయవాడలో జరిగిన ఎక్స్‌పోలో వర్ష, అతీషా, ప్రదీప్ ప్రదర్శించిన ఈ ప్రాజెక్టుకు తృతీయ బహుమతి దక్కినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు ప్రతిభకు, ప్రోత్సహించినా సైన్స్ టీచర్ సుజాతను ఆయన అభినందించారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

వి.కోట: నేడు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ యువరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చేతులమీదుగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి లబ్ధిదారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, పొదుపు మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి రాళ్లగంగమాంబ బ్రహ్మోత్సవాలు

గుడుపల్లె: మండలంలోని రాళ్లగంగమాంబ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేడు మంగళవారం నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకులు తెలిపారు. నేడు మంగళవారం అంకురార్పణ, ధ్వజారోహణం, 5న కల్యాణోత్సవం, 6న రథోత్సవం, 7న అశ్వవాహనం, 8న నంది వాహనం, 9న గజవాహనం, 10న హంసవాహనం, కీలు గుర్రాలు, 11న శేష వాహనం, కూచిపుడి భరతనాట్యం రాత్రి ఆర్కెస్ట్రా, 12న పుష్పపల్లకి, సయ్యాండి ఢీ ఈ షో, 13న సింహవాహనం పచ్చిగెరిగె అగ్నిగుండం, మా డ్యాన్స్ పలకవాయిద్యాలు,14న వసంతోత్సవం, 15న అభిషేకాలు, 16న పొంగళ్ల దీపారాధన నిర్వహించనున్నారు.

తీరిన తాగునీటి సమస్య


పనులను పర్యవేక్షిస్తున్న నేతలు

సదుం: మండలంలోని చెరకువారిపల్లె పంచాయతీ శీలయ్యగారిపల్లెలో తాగునీటి సమస్యపై గ్రామస్తులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సమస్య పరిష్కారానికి జీజీఎంపీ నిధులు మంజూరు కావడంతో బోరు, పైపులను సోమవారం ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, సర్పంచ్ ఐశ్వర్య పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

పుంగనూరు: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా సంఘ ప్రతినిధి గురురాజారావు తెలిపారు. సోమవారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో సమావేశాన్ని అధ్యక్షుడు చెంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను తెలియజేసిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, భరత్ భూషణ్, కేశవరెడ్డి, వెంకటముని, వెంకటపతి, సీతపతిరాజు, సుబ్రమణ్యం, ఈశ్వర్‌కుమార్‌రెడ్డి, గంగులమ్మ పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ రేపు

గంగవరం: మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు 3వ విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని రేపు బుధవారం గంగవరంలో నిర్వహిస్తున్నట్టు మహిళా సమాఖ్య సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల మైదానంలో ఉదయం 9.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని వెలుగు సంఘాల మహిళలు తప్పక హాజరుకావాలని కోరారు.

మామిడికి తెగులు దిగులు

- నేలరాలుతున్న పిందెలు
- ఆందోళనలో రైతులు
- సస్యరక్షణ తప్పనిసరి

చిత్తూరు అగ్రికల్చర్: మామిడి రైతుల్లో తెగులు దిగులు పట్టుకుంది. చిత్తూరు డివిజన్ పరిధిలోని రైతులు అత్యధికంగా ఉద్యాన పంటల్లో మామిడి పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణంలో మార్పుల కారణంగా పూత ఆలస్యమైంది. ప్రస్తుతం పిందె దశలో ఉన్న మామిడి పంటకు తెగులు సోకడంతో కాయలు నేలరాలుతున్నాయి. దీంతో రైతుల్లో వచ్చిన పంట నేలరాలుతుండడంతో దిగాలు చెందుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే పంటలో సస్యరక్షణ–యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని ఉద్యానవన శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

చిత్తూరు డివిజన్ పరిధిలోని రైతులు 5 వేల హెక్టార్లలో మామిడి పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణంలో మార్పుల కారణంగా చెట్లలో పూత ఆలస్యంగా వచ్చింది. ఫలితంగా ప్రస్తుతం పంట పిందె దశలో ఉంది. అయితే కాయలకు నల్ల మచ్చలు తెగులు సోకడం వల్ల అత్యధిక శాతం పిందెలు నేలరాలుతున్నాయి. అధికంగా తవణంపల్లె, బంగారుపాళెం, ఐరాల, యాదమరి, పూతలపట్టు మండలాల పరిధిలో తెగులు ప్రభావంతో పిందెలు నేలపాలవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు అప్రమత్తమై తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలియజేస్తున్నారు.

చీడల నివారణ...

ప్రస్తుతం మామిడి పంట ఎక్కువ భాగం బఠాణీ సైజు నుంచి నిమ్మకాయ పరిమాణం వరకు ఉంది. ఈ మధ్య కురిసిన అకాల వర్షాల కారణంగా ఎక్కువ భాగం తామర పురుగులు, మచ్చతెగులు పంటను ఆశించాయి. కొన్ని ప్రాంతాల్లో తేనె మంచు పురుగు, బూడిద తెగులు, కాయతొలిచే పురుగు బెడద అధికంగానే ఉంది. ఇటీవల వడగళ్ల వాన కురవడంతోపాటు, పిందెలు అధికంగా రాలడం వల్ల రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈ సమస్యల నివారణకు లీటరు నీటికి


నేల రాలిన పిందెలు

ఫిప్రొనిల్ 1.5 నుంచి 2 మి.లీ., వేపనూనె 1.0 మి.లీ, ఇసాబియాన్ 2 మి.లీ., మాంకోజెబ్ + మెటాలాక్జిల్ 2 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలి.

పిందెలు రాలకుండా నీటి తడులు

మామిడిలో పిందెలు రాలిపోవడం పెద్ద సమస్యగా మారింది. నీటి ఎద్దడి, హార్మోను, పోషక లోపాల వల్ల ఇలా జరుగుతుంది. పిందె దశలో 15–20 రోజుల వ్యవధిలో అవకాశమున్న చోట చెట్లకు 2–3 నీటి తడులివ్వడం మంచి ఫలితాలిస్తాయి. దీనివల్ల పిందెలు రాలడం తగ్గుతుంది. కాయలు పెద్ద సైజులో నాణ్యంగా ఉంటాయి. నీటి సౌకర్యం లేనిచోట చెట్లకు ట్యాంకర్ల ద్వారా నీటి తడులు ఇవ్వాలి.

ఎరువుల వాడకం

మామిడి పిందెలు ఏర్పడి పెరిగే దశలో చెట్ల సైజును బట్టి 500–1000 గ్రాముల యూరియా, 500–1000 గ్రాముల పొటాష్ ఎరువులను 2 కిలోల వేప పిండితో కలిపి ప్రతి చెట్టుకూ వేస్తే కాయలు పెద్ద సైజులో వచ్చి నాణ్యమైన దిగుబడులు వస్తాయి. అంతే కాకుండా చీడల నివారణలో ఉత్తమ ఫలితాల కోసం వీలైనంత వరకు ఒకసారి చల్లిన మందులను మరోసారి చల్లకూడదు.

సింథటిక్ పైరిత్రాయిడ్ల జోలికెళ్లొద్దు ...

మామిడిలో వీలైనంత వరకు సింథటిక్ పైరిత్రాయిడ్ పురుగు మందులను వాడకపోవడం మంచిది. మొదట్లో ఇవి వాడిన వెంటనే మంచి ఫలితాలు రావచ్చు. కానీ వాటిని రెగ్యులర్‌గా వినియోగించడం వల్ల కొన్ని పురుగులు వీటిని తట్టుకునే శక్తిని సంపాదించుకుంటాయి. తక్కువ స్థాయిలో ఉండే మరికొన్ని పురుగులు తీవ్ర స్థాయికి చేరుకుంటాయి. మున్ముందు ఈ పురుగులను నివారించడం అసాధ్యమవుతుంది.


నల్ల మచ్చ తెగులు సోకిన కాయ

సిఫార్సు మేరకే మందులు వాడాలి



మామిడిలో ఎప్పటికప్పుడు సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా అవలంబించాలి. పంటలో మంచి ఫలితాలు పొందాలంటే తప్పనిసరిగా సిఫార్సు చేసిన మోతాదులోనే క్రిమి సంహారక మందులను వాడాలి. ఇందుకోసం సంబంధిత అధికారులు, నిపుణులను సంప్రదించి వారి సలహా మేరకు మందులు వాడితే మంచిది.

–మధుసూదన్‌రెడ్డి, డీడీ, ఉద్యానవన శాఖ

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఈనెల 5వ తేదీ బుధవారం ఆసరా మెగా చెక్కును పంపిణీ చేస్తున్నారని, ఈసందర్భంగా ఏర్పాటుచేయనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. 5వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు మంత్రి పెద్దిరెడ్డి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన బహిరంగ సభకు చేరుకోనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, అంజిబాబు, మండల సచివాలయ కన్వీనర్ రుక్మిణమ్మ, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్ భరత్, సర్పంచుల సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కోఆప్షన్ మెంబర్ సాదిక్ బాషా, ఎంపీడీఓ సుధాకర్, ఏపీఎం నర్సోత్తమరెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పర్యటన విజయవంతం చేద్దాం

పులిచెర్ల(కల్లూరు): మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పులిచెర్ల పర్యటన విజయవంతం చేద్దామని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటలకు పులిచెర్లలో మంత్రి చేతులమీదుగా స్వయం సహాయక సంఘ సభ్యులకు ఆసరా చెక్కులను అందజేస్తారన్నారు. అందరూ మహిళాసంఘ సభ్యులు హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ మురళీధర్, నాథమునిరెడ్డి, పోకల చంద్ర, సర్పంచ్ రాణెమ్మ, నాగరాజ ప్రసాద్, ఎంపీడీఓ సుగుణమ్మ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేద్దాం

సోమల: ఈనెల 5న జరగబోయే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేద్దాం అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల, గ్రామస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ, డీటీ ప్రకాష్‌బాబు, వైస్ ఎంపీపీ సయ్యద్‌బాషా, నేతలు వరదం వెంకటరమణ, సాంబశివయ్య, సరస్వతమ్మ, ఏపీఎం శివయ్య పాల్గొన్నారు.

5న ఆసరా చెక్కుల పంపిణీ

పుంగనూరు: రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా ఆసరా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎన్‌ఎస్.పేట బసరాజ జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం 9.30 గంటలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, నేతలు జయరామిరెడ్డి, కొత్తపల్లె చెంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, రమణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

రొంపిచెర్ల: ఈ నెల 6న రొంపిచెర్లలో జరగనున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బహిరంగసభను విజయవంతం చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘమిత్రలు, వలంటీర్లతో మంత్రి పర్యటనపై సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా స్వయం సహాయక సంఘాలకు ఆసరా నిధుల చెక్కులను పంపిణీ చేస్తామని తెలిపారు. సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, వైస్ ఎంపీపీలు విజయశేఖర్, రెడ్డెప్ప, ఎంపీడీఓ రాజేంద్ర, నాయకులు చెంచురెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, ఇబ్రహీంఖాన్, సురేంద్రనాయుడు, సూర్యనారాయణరెడ్డి, యుగంధర్‌రెడ్డి, కమలాకర్ రెడ్డి, చిన్న నాగరాజ పాల్గొన్నారు.

సింహవాహనంపై విహరించిన కోదండరాముడు

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు సింహవాహనంపై గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవ విగ్రహాలను సింహవాహనంపై కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

అవ్వాతాతలకు కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లెలో సోమవారం జగనన్న కంటి వెలుగులో భాగంగా అవ్వాతాతలకు కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలను అందజేస్తారని కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.జానకిరావు తెలిపారు. డా.పెంచలయ్య కంటి పరీక్షలు చేశారు. ఎంపీటీసీ ఉషారాణి, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శారద, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

హంస వాహనంపై పార్వతీపరమేశ్వర్లు


పురవీధుల్లో ఊరేగుతున్న పార్వతీపరమేశ్వర్లు

రామకుప్పం: రామకుప్పంలో వెలసిన శ్రీఅన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పార్వతీపరమేశ్వర్లకు ఉభయదారులు వెంకట్రమణనాయుడు ఆధ్వర్యంలో వైభవంగా హంస వాహనసేవ నిర్వహించారు.

నేడు గిరిజా కల్యాణం..

స్థానిక గాండ్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 6 గంటలకు గిరిజా కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కల్యాణ మండప నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత

సోమల: స్థానిక స్వయంబేశ్వర స్వామి ఆలయంలో నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణం కోసం సోమవారం దాతలు విరాళం అందించారు. సోమలకు చెందిన సూరిశెట్టి సాంబయ్య, పార్వతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సూరిశెట్టి శంకర రూ.10,116 లను ఆలయ ధర్మకర్త సోమశేఖర్‌కు అందజేశారు.

బ్రిక్స్ కార్మికుల నిరసన


ఎస్టేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

పలమనేరు: పట్టణానికి చెందిన పలు పరిశ్రమల బ్రిక్స్ కార్మికులు సోమవారం స్థానిక ఎస్టేట్ వద్ద నిరసన తెలిపారు. బంగారుపాళెం నుంచి సిమెంట్ రాళ్లతో వచ్చిన వాహనాన్ని ఇక్కడి స్థానిక కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఇక్కడి ఫ్యాక్టరీల్లో ఓ సిమెంట్ ఇటుకను రూ.30కి విక్రయిస్తున్నామని తెలిపారు. అయితే బంగారుపాళ్యానికి చెందిన పెద్ద ఫ్యాక్టరీ నిర్వాహకుడు సిమెంట్ రాయిని రూ.25కే పట్టణంలో విక్రయాలు సాగిస్తున్నందున తమ వ్యాపారాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. ఇకపై బయటి వ్యాపారులు పట్టణంలోకి రాకుండా చూడాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసి పోలీసులు ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఈ నిరసనలో బ్రిక్స్ యూనియన్ నేత వినాయకం, బిక్స్ కార్మికులు పాల్గొన్నారు.


గురువులతో పూర్వవిద్యార్థులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

పలమనేరు: పట్టణ సమీపంలోని జీఎల్‌ఎస్‌ఫామ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991 సంవత్సరం నుంచి 1995 దాకా చదివిన పూర్వవిద్యార్థులు సోమవారం కలిసి వారి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాటి మధురానుభూతులను స్మరించుకుని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.